క్లుప్తంగా

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకోవాలి



వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుపై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ హితవు పలికారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన 20 నెలల్లో దేవాదుల నీటితో మండలంలో చెరువులు, కుంటలను నింపలేదన్న ప్రకటనపై క్షేత్రస్థాయి నిరూపణకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి దయాకర్ రావు కుటిల రాజకీయాలు సాగవని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కుల్ల యాకాంతం, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి


నెక్కొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ కోరారు. మండలంలోని బొల్లికొండ, అలంకానిపేట, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచించారు. పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరేయాలని ఆకాంక్షించారు. సమావేశాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు లావుడ్య తిరుమల్, ఆవుల శ్రీనివాస్, రెడ్లవాడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజనాల సంపత్, నాయకులు బండి శివకుమార్, బానోతు శ్రీధర్, రాంపెల్లి శ్రావణ్, మాదాసు రామ్మూర్తి, మాచర్ల శేషగిరి, ఎడ్ల సురేందర్, బానోలు యాకు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు



నర్సంపేట : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పదో వార్డు పరిధిలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని గల్లీలోని ఇళ్లలోకి వరద నీరు చేరగా మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వరద నీటితో ఇళ్లు మునిగే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి, డివిజన్ ఇన్‌చార్జ్ రవికుమార్ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. మున్సిపల్ జవాన్ బోడ మొగిలి సిబ్బందితో కలిసి జేసీబీతో కందకం తీయించి ఇళ్లలోకి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అలువాల రాజు, మహేందర్, కాంగ్రెస్ నాయకులు మనగాని వెంకన్న, కొత్తగట్టు ప్రశాంత్, కొత్తగట్టు కుమార్, కుక్కల సారంగం, కుక్కల వేణు పాల్గొన్నారు.

రేవూరిపై విమర్శలు అర్థరహితం



గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ జిల్లా, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి అన్నారు. మండలంలోని కోనాయమాకులలో సంగెం, గీసుకొండ మండలాల ముఖ్యనాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌తో కలిసి శ్రీనివాస్‌రెడ్డి, కొమురారెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ప్రకాశ్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి ప్రజలను విస్మరించడంతోనే ప్రజలు ఆయన్ను ఓడించారని ధ్వజమెత్తారు. నాటి అక్రమాలను ధర్మారెడ్డి మర్చిపోయినట్టు ప్రస్తుత ఎమ్మెల్యేపై అసత్యవ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకే ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారానికి తెగబడుతున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పార్టీ సంగెం మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, నాయకులు రమేశ్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, జగన్నాథచారి, రాంబాబు, రమేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుడెప్పాడ్ జంక్షన్



గుంతలమయంగా మారిన గుడెప్పాడ్ జంక్షన్



రోడ్డుపై నిలిచిన వరద నీరు

- గుంతలతో వాహనదారుల ఇబ్బందులు
- వర్షం కురిస్తే రోడ్డుపైనే వరదనీరు
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ జంక్షన్ ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ జంక్షన్‌లో అనేక ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి. జంక్షన్ మీదుగా బస్సులు, ప్రైవేటు వాహనాలతో పాటు అధికలోడ్‌తో భారీ వాహనాలు రవాణా కొనసాగిస్తుంటాయి. జాతీయ రహదారి కావడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లే గూడ్స్ వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రాముఖ్యత కగిన రోడ్డు పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారింది. వర్షాకాలం అవడంతో గుంతలు కనిపించకపోవడంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. వాహనదారుల ఇబ్బందులను గుర్తించిన పోలీస్‌లు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే రోడ్డుపై గుంతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రమాదాలు జరుగుతున్నాయని సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా దృష్టిసారించి జంక్షన్‌ని ఆధునీకరించే విధంగా ప్రతిపాదనలు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

ధర్మసాగర్ : దేశంలోని పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అరకొరగా అమలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని, వారికి ఇంటి పట్టాలు అందించి ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. అయినా ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ పేద ప్రజలకు మాత్రం ఇళ్లు, స్థలాలు, పట్టాలు అందలేదని అన్నారు. అలాగే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాలో అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టును నిర్మాణం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. రాంపూర్– మడికొండ డంపింగ్ యార్డును ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆగస్టు 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరగనున్న సీపీఐ రాష్ట్ర 4వ మహాసభకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా సహాయ కార్యదర్శులు భిక్షపతి, ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యుడు స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యుడు భిక్షపతి, మండల కార్యదర్శి వెంకటేశ్, జిల్లా నాయకులు శంకర్‌నాయక్, మల్లయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ‘ఖర్గే’ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరకాల : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే జన్మదిన వేడుకలను సోమవారం కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు. పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ అన్నారు. పేదల సంక్షేమం కోసం మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలో పార్టీ నిరంతరం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు రంజాన్ అలీ, రమేశ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తిని కాపాడుకోవాలి

- గౌడ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ వైస్ చైర్మన్ మల్లేశంగౌడ్



తాటి, ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ ఎస్సై, గౌడ సంఘం నాయకులు

పరకాల : కల్లు గీతా కార్మికులను, గీత వృత్తిని కాపాడుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా గౌడ సంఘం జేఏసీ వైస్ చైర్మన్ ఆముదాలపల్లి మల్లేశం గౌడ్ కోరారు. పరకాల ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం, నాగారం గ్రామాల్లో తాటి, ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే తరాలకు తరగని సంపద తాటి, ఈత వనాలని వాటిని కాపాడాల్సిన బాధ్యత గీత కార్మికులపై ఉందన్నారు. ఎక్సైజ్ ఎస్సై సులోచన, గౌడ సంఘం నాయకులు తిరుపతిగౌడ్, మల్లయ్యగౌడ్, యాదగిరి, ఓదెలు, రవీందర్, నరహరి, శ్రీను, సుధాకర్, కిరణ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, గీత కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎల్ఐసీ ఏజెంట్ మృతి



కుమారస్వామి (ఫైల్)

పరకాల : పట్టణంలో నివాసం ఉంటూ ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న చేరు కుమారస్వామి (44) సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. ఛాతినొప్పితో బాధపడుతున్న అతడిని కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరికి తరలించారు. సౌమ్యుడిగా పేరున్న కుమారస్వామి మృతితో పరకాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

‘స్థానిక’ ఎన్నికలకు సిద్ధం కావాలి

దుగ్గొండి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ కోరారు. మండలంలోని వెంకటాపురంలో కందిపల్లి శంకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సన్నాహక సభకు రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రపంచ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అండగా నిలుస్తారని తెలిపారు. సమావేశంలో సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, నాయకులు నాంపల్లి సుధాకర్, ఊరటి రవి, తాళ్లపల్లి వీరస్వామి, ధరావత్ రాజు, పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు కైవసం చేసుకుని గులాబీ జెండా ఎగురవేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు సూచించారు. మండలంలోని ఇటుకాలపల్లి ఎంపీటీసీ పరిధిలోని ఏనుగల్‌తండా, కొండసముద్రంతండా ముఖ్యకార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోయారన్నారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంజూరు చేయించిన నిధులతో చేపడుతున్న పనులకు కొబ్బరికాయలు కొడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడచినా సొంతంగా ఒక్క మండలానికి కూడా కనీసం కోటి రూపాయలు మంజూరు చేయించలేదని విమర్శించారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు రాంప్రసాద్, వీరన్న, రవి, మాజీ సర్పంచ్ రవి, నాయకులు బానోతు జైకిసాన్, బాపూరావు, కిరణ్, వీరన్న, రవి, పితావత్ కిషన్, బోడ భద్రు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందని ఫిర్యాదు

ఆత్మకూరు : మండలంలోని మల్కపేటకు చెందిన బుస్స వేణు కొద్దిరోజుల క్రితం అదే గ్రామానికి చెందిన మాడిశెట్టి వేణు భార్యను తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం గుడెప్పాడ్ వద్ద మాడిశెట్టి వేణును బుస్స వేణు దుర్భాషలాడుతూ బెదిరించినట్లు తెలిపారు. ఈ మేరకు మాడిశెట్టి వేణు తనకు బుస్స వేణుతో ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడిచేసిన ఇద్దరిపై కేసు

ఆత్మకూరు : స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని మద్యం మత్తులో పల్సర్ బైక్‌పై వచ్చి ఢీ కొట్టి, దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలగిరికి చెందిన బొట్ల కుమారస్వామి ఈనెల19న మండల కేంద్రంలోని కామారం రోడ్డులో గల కిరాణానికి స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో దుగ్గొండి మండలం తొగరురామయ్యపల్లికి చెందిన పొగాకు రంజిత్ పల్సర్ బైక్‌పై వెనుక నుంచి కుమారస్వామి స్కూటీని ఢీ కొట్టాడు. దీంతో కుమారస్వామి కిందపడగా మద్యం మత్తులో ఉన్న పొగాకు రంజిత్ అతడితో ఉన్న తాత రవి కుమారస్వామిపై దాడిచేసి గాయపర్చారు. స్థానికులు అతడిని ఓ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గురుకుల పాఠశాలలో పాము కలకలం

పర్వతగిరి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం పాము కలకలం సృష్టించింది. ఐదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలోని గడ్డిని తొలగిస్తుండగా పాము కనిపించడంతో విద్యార్థులు బెంబేలెత్తారు. ఐదో తరగతి విద్యార్థిని శివానీ తనను పాము కరిచిందని భావించి తీవ్ర భయాందోళనకు గురైంది. దీంతో ప్రిన్సిపాల్ అపర్ణ, ఉపాధ్యాయులు శివానీని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మీడియాతో మాట్లాడారు. శివానీ భయపడిందని, ఆమెను పాము కాటు వేయలేదని, ఆస్పత్రిలో అబ్జర్వేషన్ అనంతరం ఇంటికి పంపించామని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

రాయపర్తి : మండలంలోని సన్నూరులో బాల వికాస సేవా సంస్థ అనుబంధ జనవికాస ఆధ్వర్యంలో తొర్రూరుకు చెందిన లక్ష్మీనర్సింహ ఆస్పత్రి నిర్వాహకులు సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్ తేజస్విని మహిళలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

రాజ్యాధికారమే సమస్యలకు పరిష్కారం


- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కుమారస్వామి



అభివాదం చేస్తున్న నాయకులు

నల్లబెల్లి : దళిత బహుజనులు తరతరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు రాజ్యాధికారమే పరిష్కారమని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత మేధా శక్తి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం చేపట్టిన దీక్షను కుమారస్వామి ప్రారంభించి మాట్లాడారు. అగ్రకుల పార్టీలు దళిత, గిరిజన, బీసీలకు హామీలు గుప్పించి ఓట్లు దండుకుని తర్వాత విస్మరించడం రివాజుగా మారిందని మండిపడ్డారు. చెవెళ్ల డిక్లరేషన్ మేరకు ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్, అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇండ్లు, అసైన్డ్ భూముల పునరుద్ధరణ, ఎస్టీలకు అటవీ హక్కుల చట్టాన్ని వర్తింప చేయాలని కోరారు. దీక్షలో కూర్చున్న వారికి బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ నిమ్మరసం అందించి విరమింపజేశారు. దీక్షలో దళిత మేధా శక్తి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల పవన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొట్టె సురేశ్, ప్రచార కమిటీ అధ్యక్షుడు అడ్డ రాజు, కోశాధికారి సంపత్, సహాయ కార్యదర్శి నత్తి శ్యామ్, తదితరులు పాల్గొనగా బీసీ హక్కుల సాధన సమితి నాయకులు దామోదర్, వీరస్వామి, మోహన్‌రెడ్డి, వీరమల్లు, బీజేపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, వల్లె పర్వతాలు సంఘీభావం తెలిపారు.

పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు



దుగ్గొండి : మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఆషాఢమాస బోనాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలతో ర్యాలీగా రాగా కొందరు విద్యార్థులు పోతురాజుల వేషధారణతో నృత్యాలు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించారు. విద్యాసంస్థల చైర్మన్ రవి, బత్తిని భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

శాటిలైట్‌తో సర్వే చేపట్టాలి

మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు విజేందర్



బ్యానర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని చెరువులు, కుంటలను ప్రభుత్వం శాటిలైట్‌తో సర్వే చేయించి పూడికలు తీయించి ఫెన్సింగ్ వేయాలని మత్స్యకార్మిక సంఘం (టీఎమ్‌కేఎమ్‌కేఎస్) జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ కోరారు. సోమవారం మండలంలోని మాందారిపేటలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భూముల రేట్లు పెరగడం వల్ల భూ దందాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులు, కుంటలు, జల వనరులు, నదీ పరివాహక ప్రాంతాల భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. చెరువులు, కుంటలు, నదీ పరివాహక ప్రాంతాల భూములను శాటిలైట్‌తో సర్వే చేయించి కాపాడాలని అన్నారు. అలాగే మండల కేంద్రంలో చేపల మార్కెట్ నిర్మించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన మత్స్యకారులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మత్స్యకార్మిక సంఘం మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన సాదు నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సభ్యులుగా భాస్కర్, నరేష్, రంజిత్, రాజ్‌కుమార్, మహేశ్, తిరుపతి, ఉప్పలయ్య, సతీశ్, రాజుకుమార్, అన్వేష్, భరత్, తిరుపతి, విష్ణు, క్రాంతి, శివ, రాజ్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బ్యానర్ ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహా ధర్నాకు ఉద్యమకారులు తరలిరావాలి



మాట్లాడుతున్న గణేశ్

శాయంపేట : తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ లోని గన్‌పార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన మహా ధర్నాకు మండలంలోని ఉద్యమకారులు తరలిరావాలని ఆ ఫోరం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గణేశ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, గుర్తింపు కార్డు, ఉచిత బస్సు, రైలు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.10వేల కోట్లతో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు తదితర డిమాండ్ల సాధనకు మహా ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యమకారులు, కవులు, కళాకారులు, వివిధ సంఘాల నాయకులు, అన్ని పార్టీల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు సారయ్య, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ మహ్మద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న గంగాజమున

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామంలో గల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులకు ఏఓ గంగాజమున సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానో యూరియా, నానో డీఏపీ వినియోగం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు, నాణ్యతా పెరుగుతుందని అన్నారు. పంటలకు పర్యావరణ ఒత్తిడి, తెగుళ్లను తట్టుకునే శక్తిని వస్తుందని తెలిపారు. నానో యూరియా, డీఏపీలు పర్యావరణహితంగా పనిచేస్తాయని, నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని అన్నారు. గాలి, నీటి, కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. అనంతరం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 20 టన్నుల యూరియా నిల్వ ఉంచినట్లు ఆమె తెలిపారు.

సంక్షిప్తంగా

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దామెర : రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ సూచన మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు శిథిలమైన ఇళ్లు, పురాతన మట్టిగోడల వద్ద ఉండొద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, వైర్లకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులుపడే ప్రమాదం ఉందని చెట్ల కింద ఉండొద్దని తెలిపారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే డయల్ 100కు, గ్రామ పంచాయతీ అధికారులకు, సిబ్బందికి వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ అనుసంధానంగా ఉన్న బాలికల హాస్టల్‌లో రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఎంఈఓ చదువుల సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మెస్ కమిటీల ద్వారా నియామకం ఉంటుందని పేర్కొన్నారు. నెలకు వేతనం రూ.6,500 అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎల్కతుర్తి నివాసులై, 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అప్లికేషన్ ఫామ్, బయోడేటా, 7లేదా 10వ తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, నివాసం సర్టిఫికెట్ జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ వార్డెన్‌కు అందించాలని సూచించారు. ఈ నియామకం కాంట్రాక్టు ప్రాతిపదికన ఉటుందని పేర్కొన్నారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో మిగిలిన సీట్లకు మంగళవారం నుంచి స్పాట్ అడ్మిషన్లు స్వీకరించనున్నట్లు కళాశాల, పాఠశాల ప్రత్యేక అధికారి మాధవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియం 6వ తరగతిలో 8 సీట్లు, ఇంటర్మీడియట్ మెదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియం ఎంపీసీలో 4 సీట్లు, బైపీసీలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

బోనస్ డబ్బులు వెంటనే జమచేయాలి

నడికూడ : సన్నాలు సాగుచేసిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 ఇచ్చే బోనస్ డబ్బులు వెంటనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యాసంగి ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా రైతుల ఖాతాల్లో బోనస్‌లు జమకాలేదని ఆరోపించారు. వెంటనే చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.

‘కుటుంబ భరోసా’ చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఫొటో గ్రాఫర్ల సంఘం నాయకులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన సీనియర్ ఫొటో గ్రాఫర్ బాల్నే తిలక్‌బాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఆయన తెలంగాణ రాష్ట్ర ఫొటో గ్రాఫర్ కుటుంబ భరోసాలో సభ్యత్వం పొంది ఉన్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి అధ్యక్షతన ఫొటో గ్రాఫర్ సంఘం కుటుంబ భరోసా స్టేట్ ఫౌండర్ వెంకట్‌రెడ్డి హనుమకొండలోని సీపీరెడ్డి కాంప్లెక్స్‌లో సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.1.70 లక్షల చెక్కును అందించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవి, కోశాధికారి మాధవరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి సత్యం, ఉమ్మడి వరంగల్ జిల్లా కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ సూరిబాబు, కార్యవర్గ సభ్యులు, శాయంపేట ఫొటో గ్రాఫర్లు ఉన్నారు.